సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 5 । ఆగస్టు । 2024



దుఃఖదాయిని నక్కల డ్రెయిన్

నక్కల డ్రెయిన్ దుఃఖదాయినిగా మారింది. వరదలతో యలమంచిలి, పోడూరు, ఆచంట, పెనుగొండ మండలాల్లోని వేల ఎకరాల్లో పంట నష్టపోతుంది. 8లో



శ్రావణం.. శుభప్రదం

శివకేశవులకు ప్రీతికరం.. అమ్మవారి ఆరాధనకు అనువైన మాసం శ్రావణం. మహిళలు పూజలు, వ్రతాలు జరుపుకునే ఈ మాసం నేటి నుంచి ప్రారంభం కానుంది. 8లో



బీచ్‌లో విద్యార్థి గల్లంతు

స్నేహితులతో కలిసి సంతోషంగా గడిపేందుకు పేరుపాలెం బీచ్‌కు సముద్ర స్నానానికి వెళ్లిన తణుకుకు చెందిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. 8లో

మొక్కుబడిగా భోజనం

మిథ్యగా మధ్యాహ్న భోజనం

- ముద్దవుతున్న అన్నం.. పప్పు లేని ఆకుకూర
- పశ్చిమలోని 79 పాఠశాలల్లో 84 ఎస్జీటీ పోస్టుల ఖాళీ
- డిప్యుటేషన్‌తో అరకొరగా సబ్జెక్టుల బోధన
- అమ్మఒడికి ఎగనామం!



ఉండి హైస్కూల్‌లో ఇంటి నుంచే క్యారేజీలు తెచ్చుకుని భోజనం చేస్తున్న విద్యార్థులు



పెంటపాడు ప్రభుత్వ బేసిక్ స్కూల్‌లో చిమిడిన అన్నాన్ని బయట పారబోసిన దృశ్యం



ఆకివీడు : వైఎస్ జగన్ పాలనలో విద్యా రంగం అనేక విప్లవాత్మక మార్పులతో కొత్త పుంతలు తొక్కింది. జాతీయ స్థాయిలో అనేక రాష్ట్రాలు రాష్ట్రంలో విద్యా సంస్కరణలను కొనియాడడంతో పాటు.. ఆ విధానాలపై అధ్యయనానికి తమ బృందాలను కూడా పంపాయి. బడికి వెళ్లాలంటేనే భయపడిన విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు కల్పించారు. అలాంటి స్థితి నుంచి ప్రస్తుతం ప్రభుత్వ విద్యారంగం తిరోగమన బాట పట్టింది. పశ్చిమ గోదావరి జిల్లాలో దాదాపు నెలరోజులుగా మధ్యాహ్న భోజనం విద్యార్థులకు రుచించడం లేదు. ఉపాధ్యాయుల కొరత పెద్ద సమస్యగా మారింది. అవసరమైన మేర ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులకు సరైన బోధన లేక, సమయానికి సిలబస్ పూర్తి కాక విద్యార్థులు అయోమయ పరిస్థితి ఎదుర్కొంటున్నారు.

తగ్గిన విద్యార్థుల చేరిక

ఈ ఏడాది కొత్త విద్యార్థుల చేరిక మాట ఎలా ఉన్నా, ఉన్న విద్యార్థుల సంఖ్య పడిపోతుంది. జగన్ పాలనలో ప్రభుత్వ పాఠశాలల్లో చేరికకు విద్యార్థులు క్యూ కట్టారు. కొన్ని చోట్ల ప్రభుత్వ పాఠశాలల్లో నో అడ్మిషన్లు బోర్డులు కూడా వెలిశాయి. ఈ ఏడాది విద్యావ్యవస్థకు గ్రహణం పట్టినట్లు విద్యార్థుల సంఖ్య పడిపోయింది.

79 స్కూళ్లలో ఎస్జీటీ పోస్టుల ఖాళీ


జిల్లాలోని 79 పాఠశాలల్లో 84 మంది ఎస్జీటీ పోస్టులు భర్తీ కావాలి. ఆయా ఖాళీల్లో ఉపాధ్యాయుల నియామకం లేక ఇతర పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు డిప్యుటేషన్‌పై విద్యా బోధన కొనసాగిస్తున్నారు. దీనివల్ల రెండు పాఠశాలల్లోని విద్యార్థులకు పూర్తి స్థాయిలో ఆయా సబ్జెక్టుల పట్ల అవగాహన ఉండడం లేదు. ఉపాధ్యాయులపై అదనపు పని భారం పడుతుంది. దూర ప్రాంతాలకు వెళ్లి విద్యా బోధన చేయడం ద్వారా అధిక శ్రమకు గురికావలసి వస్తోంది. జిల్లాలోని కొన్ని పాఠశాలల్లో డిప్యుటేషన్‌పై ఉపాధ్యాయులు 10 నుంచి 15 కిలోమీటర్ల వరకూ వెళ్ళాల్సి వస్తుంది. అలాగే సబ్జెక్టు టీచర్ల కొరతతో విద్యార్థులకు ఆయా సబ్జెక్టులపై అవగాహన లోపిస్తోంది. నిబంధనల ప్రకారం ఏ తరగతికైనా 40 మంది విద్యార్థులకు ఒక టీచరు చొప్పున ఉండాలి. ప్రస్తుతం 6 నుంచి 8వ తరగతి వరకూ విద్యార్థులకు 50 మందికి ఒక టీచరు చొప్పున బోధించాల్సి వస్తోంది.

గత ప్రభుత్వ చలువతోనే స్టూడెంట్ కిట్స్

జగనన్న విద్యాకానుక ద్వారా ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలతో పాటు నోటు పుస్తకాలు, 3 జతల యూనిఫాం, బూట్లు, టైలు, సాక్సులు, డిక్షనరీలు అందించి చరిత్ర సృష్టించారు. గత ఏడాది నవంబర్ నుంచే ప్రభుత్వం జిల్లాల నుంచి ప్రతిపాదనలు కోరి దానికి తగ్గట్టుగా పాఠశాలలు తెరిచే నాటికే జగనన్న విద్యాకానుక అందించాలనే లక్ష్యంతో వివిధ కంపెనీలకు ఆర్డర్లు కూడా ఇచ్చేయడంతో పాటు అందుకు తగ్గ నిధులు చెల్లించింది. ఈ ఏడాది విద్యార్థులకు అనుకున్న సమయానికి విద్యాకానుక అందజేయగలుగుతున్నారు.

తల్లికి వందనం ఎప్పుడు?

కొత్త ప్రభుత్వం కొలువుదీరి రెండు నెలలు కావస్తుంది. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల గడిచినా ఇప్పటికీ తల్లికి వందనం లేదు. జిల్లాలో 96,128 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల తల్లులకు ఇప్పటికీ తల్లికి వందనం నిధులు జమకాలేదు.



కొత్త బియ్యంతో తంటా

మధ్యాహ్న భోజనానికి కొత్త బియ్యం వాడ**డంతో** విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అన్నం తింటే కడుపు నొప్పివస్తుందని, తినలేకపోతున్నామని వాపోతున్నారు. స్కూళ్లకు గత ఏడాది ఖరీఫ్ బియ్యం సరఫరా అవుతుందని.. దీనివల్ల అన్నం చిమిడిపోతుందని ఫిర్యాదులు అందుతున్నాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. స్థానికంగా పండిన బియ్యం స్థానికంగానే వినియోగిస్తుండటంతో కొత్త బియ్యం ఇవ్వాల్సి వస్తుందంటున్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్ళకు పాత బియ్యం సరఫరా చేయాలని పలువురు కోరుతున్నారు. మధ్యాహ్న భోజనంలో పప్పు వాడకం బాగా తగ్గిందని కొంత మంది విద్యార్థులు ఫిర్యాదు చేస్తున్నారు. దీంతో మధ్యాహ్న భోజనం చేయలేక క్యారేజీలు తెచ్చుకోవలసి వస్తుంది. హాజరైన విద్యార్థుల్లో సగం మంది వరకూ చాలా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తినడంలేదు. జిల్లాలో 1,374 పాఠశాలల్లో 96,128 మంది విద్యార్థులుండగా సుమారు 75,527 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. మిగిలిన వారు ఇళ్లకు వెళ్లిపోవడం, క్యారేజీలు తెచ్చుకోవడం చేస్తున్నారు.

పరిహారం.. పరిహాసం

- జిల్లాలో 25 వేల ఎకరాల్లో దెబ్బతిన్న వరినాట్లు
- 1,450 ఎకరాల విస్తీర్ణంలో నారుమడుల మునక
- మంత్రుల పరామర్శలే తప్ప సాయం శూన్యం
- నాట్లు వేసి 30 రోజులు గడిస్తేనే ఇన్‌పుట్ సబ్సిడీ: ప్రభుత్వం



మంచిలి వద్ద దెబ్బతిన్న పంట పొలాలు

భీమవరం : ఈ ఏడాది ఆరంభంలోనే భారీ వర్షాలు, వరదలు రైతును ముంచేశాయి. వేల ఎకరాల్లో పంట నీటి పాలైంది. వరి నాట్లు, నారుమడులు దెబ్బతినడంతో రైతుకు కన్నీరే మిగిలింది. రైతులను ఆదుకుంటామంటూ సుడిగాలి పర్యటన చేసిన మంత్రులు ఇంతవరకు ఎలాంటి సాయం అందిస్తారో ప్రకటించలేదు. మళ్లీ సాగు ప్రారంభిద్దామంటే చేతిలో చిల్లిగవ్వ లేదు. ఈ పరిస్థితుల్లో పంట నష్టపరిహారం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. దాళ్వా ధాన్యం సొమ్ములు దాదాపు రూ.450 కోట్ల వరకు రైతులకు రావాల్సిఉంది. ఆ సొమ్ములు రాక, పరిహారం అందక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. జిల్లాలోని 20 మండలాల పరిధిలో దాదాపు 25 వేల ఎకరాల్లో నాట్లు, 1,450 ఎకరాల విస్తీర్ణంలో నారుమళ్లు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అంచనా వేసింది.

ఎకరాకు రూ.12 వేల నష్టం

జిల్లాలోని 20 మండలాల పరిధిలో సుమారు 2.11 లక్షల ఎకరాల విస్తీర్ణంలో సార్వా నాట్లు వేయాల్సి వుండగా నాట్లువేసే సమయంలో వాతావరణం అనుకూలంగా ఉండడంతో దాదాపు 1.19 లక్షల ఎకరాల విస్తీర్ణంలో నాట్లు పూర్తిచేశారు. ఎకరం విస్తీర్ణంలో నాట్లు పూర్తి చేయడానికి రూ.12 వేలు వరకు ఖర్చు చేసినట్లు రైతులు చెబుతున్నారు. ముందుగా నాట్లు వేసిన రైతులు మొదటి విడత ఎరువులు వేయడమేగాక ఒక దఫా పురుగుల మందు కూడా పిచికారీ చేశారు. ఇలాంటి తరుణంలో భారీ వర్షాలు, వరదలు తాడేపల్లిగూడెం, పెంటపాడు, తణుకు, అత్తిలి తదితర మండలాల్లోని సుమారు 25 వేల ఎకరాల్లోని వరి పంటను ముంచేసింది. గణపవరం, ఆకివీడు, పెనుమంట్ర, ఆచంట పోడూరు తదితర మండలాల్లో సుమారు 1,450 ఎకరాల్లో విస్తీర్ణంలో నారుమళ్లు దెబ్బతిన్నాయి. ఈ నష్టం మరింత ఎక్కువగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

నారుమళ్లు, నాట్లు దెబ్బతిన్న ప్రాంతాల్లోని రైతులకు తిరిగినాట్లు వేసుకోడానికి 80 శాతం సబ్సిడీపై విత్తనాలు రైతు సేవా కేంద్రాలద్వారా అందిస్తామని మంత్రులు ప్రకటించినా రైతులు మాత్రం నారుమళ్లు వేయడానికి మక్కువ చూపడం లేదు. నారుమళ్లు వేసి నాట్లు వేయడానికి సుమారు 30 రోజులు పడుతుందని.. ఆలస్యంగా నాట్లు వేయడం వల్ల పంట దిగుబడి తగ్గిపోతుందని అందువల్ల ఇతర ప్రాంతాల నుంచి నారు కొనుగోలు చేసి నాట్లు వేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. దీనివల్ల ఎకరాకు రూ.13 వేల వరకు తిరిగి పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది.

30 రోజుల కాలవ్యవధి అన్యాయం

వర్షాలు, వరదలు వల్ల జిల్లాలో 25 వేల ఎకరాల్లో నాట్లు దెబ్బతిన్నప్పటికీ వాటిలో నాట్లు వేసి 30 రోజుల గడిచిన భూముల రైతులకే ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ వస్తుందని ప్రకటించడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాట్లు దెబ్బతిన్న రైతులందరికీ ఒకేరకమైన పెట్టుబడి అవుతుందని దీనిని పరిగణలోనికి తీసుకోకుండా 30 రోజుల కాలవ్యవధి నిర్ణయించడం దారుమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతులు



పెదపాడు మండలం వట్లూరులో ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు

పెదపాడు: ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి దాపురించిందని కిసాన్ సెల్ నాయకులు రాజనాల రామ్మోహన రావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్ తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరులో రైతులు రాస్తారోకో చేసి వరి నారుతో నిరసన తెలిపారు. ఇరిగేషన్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం కారణంగా కృష్ణా డెల్టా రైతులు ఇంకా నాట్లు వేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కెఈ కెనాల్ ఆధునీకరించకపోవడంతో కర్రనాచు, తూడు, గుర్రపు డెక్క పెరిగిపోయి శివారు ప్రాంత భూములకు నీరు అందడం లేదన్నారు. కృష్ణా డెల్టా పరిధిలో పెదపాడు మండలంలో వేలాది ఎకరాలకు సాగునీరు అందడం లేదన్నారు. వట్లూరు పరిధిలో 3 వేల ఎకరాలకు పైగా వరినారు ఎదిగినా నీరు లేక బీడుగా ఉన్నాయని చెప్పారు. యుద్ధ ప్రాతిపదికన సాగునీరు అందించాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో కొమ్మన సాంబశివరావు, తుమ్మల ధన కోటేశ్వరరావు, కొమ్మన శ్రీహరిరావు, కొమ్మన రాంబ్రహ్మం, ఆళ్ల శ్రీరాములు, పర్వతనేని నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి క్షేత్రంపై అమావాస్య ఎఫెక్ట్



ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రం ఆదివారం అమావాస్య కారణంగా భక్తుల లేక నిర్మానుష్యంగా మారింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నామమాత్రంగా భక్తులు స్వామివారిని దర్శించారు. ఆ తరువాత నుంచి ఆలయ పరిసరాలు భక్తుల లేమితో వెలవెలబోయాయి. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠం క్యూకాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాల్లో భక్తులు కానరాలేదు. సోమవారం నుంచి శ్రావణమాసం ప్రారంభం కావడంతో రద్దీ పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.

చిన్నారి సిరిమువ్వలు





ఏలూరు (ఆర్ఆర్‌పేట) : నగరానికి చెందిన అభినయ నృత్యభారతి సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు జరిగిన జాతీయ నర్తనబాల అవార్డుల కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 160 మంది చిన్నారి నర్తకులు తమ నృత్య ప్రదర్శనలతో అలరించారు. స్థానిక వైఎంహెచ్ఏ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ త్యాగరాజ, అన్నమయ్య కీర్తనలకు చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి అతిథులుగా మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఎంవీ ప్రసాద్, మానవత జిల్లా అధ్యక్షుడు దేవినేని భాస్కరరావు, అడుసుమిల్లి నిర్మల, లయన్స్ జిల్లా ఉప గవర్నర్ డీ.సుబ్బారావు, ప్రముఖ సంగీత విద్వాంసులు గుడిపాటి లలితాశర్మ, హేలాపురి బాలోత్సవ్ సెక్రటరీ జీవీఎల్ నరసింహారావు, మానవత స్టేట్ కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నాట్యాచార్య దువ్వి హేమసుందర్ అభినయ నృత్యభారతి సంస్థ ద్వారా నాట్య రంగానికి చేస్తున్న సేవలు అద్వితీయమని కొనియాడారు.

ఏలూరులో చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంకా తేరుకోని గ్రామాలు

మళ్లీ పెరుగుతున్న గోదావరి



పడవపై వాగు దాటుతున్న గిరిజనులు



కుక్కునూరు గుండేటి వాగు వద్ద గోదావరి వరద

వేలేరుపాడు: వేలేరుపాడు మండలంలోని దిగువ ప్రాంతంలో ఉన్న 18 గిరిజన గ్రామాలు 16 రోజు కూడా జలదిగ్బంధంలోనే ఉన్నాయి. గత 16 రోజులుగా కోయిదా వెళ్లే రహదారిలో ఎద్దుల వాగు వంతెన మునిగే ఉంది. ఈ వంతెన వరద నీటి నుంచి బయటపడక ముందే భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం మళ్లీ పెరుగుతోంది. ఆదివారం రాత్రి 8.30 గంటలకు నీటిమట్టం 37 అడుగులకు చేరుకుంది. దీంతో ఆ గ్రామాల గిరిజనులు నానా ఇబ్బందులు పడుతున్నారు. గత 16 రోజులుగా పడవ ప్రయాణమే దిక్కయ్యింది. మండలంలోని కోయిదా, కాచారం కట్కూరు, పేరంటపల్లి టేకుపల్లి, టేకూరు ఎడవల్లి, చిట్టరెడ్డి పాలెం, ఎర్రతోగు, తాళ్లగొంది, పూసుగొంది, సిద్ధారం, మరో ఆరు గ్రామాలకు వేలేరుపాడుతో సంబంధాలు తెగిపోయి 16 రోజులవుతుంది. మండల కేంద్రానికి రావాలంటే ఎద్దుల వాగు వద్ద పడవపై ప్రయాణించాల్సి వస్తుంది.

4 అడుగులు పెరిగిన వరద

కుక్కునూరు : గోదావరి వరద మళ్లీ నాలుగు అడుగులు పెరిగింది. ఆదివారం ఉదయం భద్రాచలం వద్ద 33 అడుగులకు తగ్గిన గోదావరి వరద ప్రవాహం మధ్యాహ్నం నుంచి పెరుగుతూ వచ్చింది. సాయంత్రానికి 37 అడుగులకు చేరింది. మరో రెండడుగులు పెరిగి ఆ తరువాత తగ్గుముఖం పట్టే అవకాశం ఉన్నట్టు సీడబ్లూసీ అధికారులు అంచనా వేశారు. పరీవాహకం ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాల కారణంగా వరద పెరిగినట్టు అధికారులు తెలిపారు.



నీటిలోనే ఎద్దుల వాగు వంతెన

న్యూస్‌రీల్

వైభవంగా అమ్మవార్ల జాతర



మావుళ్ళమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవారు

వీరవాసరం: రాయికుదురులో వేంచేసిన శ్రీ మావుళ్ళమ్మ, మహాలక్ష్మమ్మ, పోతురాజు స్వామి వార్ల ఆషాఢ మాస జాతర మహోత్సవాలు ఆదివారం ఘనంగా పూర్తయ్యాయి. అమావాస్య ఆదివారం కావడంతో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంది. తెల్లవారుజాము నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. చలిమిడి, వడపప్పు, పానకాలతో నైవేద్యాలు చెల్లించారు. అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులకు ఆలయ ప్రాంగణంలో శ్రీ కోదండ రామాలయం లింగాకారం సెంటర్ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ పెద్ద ఎత్తున నిర్వహించారు.

రేపు ఉపాధ్యాయులకు సమీక్షా సమావేశం

భీమవరం : ఈ నెల 6న మార్టేరులోని రెడ్డి కల్యాణ మండపంలో జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులకు సమీక్షా సమావేశం ఏర్పాటు చేసినట్లు డీఈఓ జి.నాగమణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 పాఠ్య ప్రణాళిక, ఏపీఓఎస్ఎస్ ఎస్ఎస్‌సీ, ఇంటర్ ప్రవేశాలపై సమీక్షా సమావేశం నిర్వహిస్తామన్నారు.

శాంతి థాంలో ప్రత్యేక పూజలు



పెనుగొండ: ఆషాఢ మాసం ఆఖరి వారం కావడంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ విరాజిల్లింది. అమ్మవార్లు శాకంబరి అలంకరణల్లో దర్శనమిచ్చారు. పెనుగొండలోని అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి థాంలో ఉదయం నుంచి వాసవీ మాతకు అభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించారు. వాసవీ ప్రతిమలను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 500 మంది మహిళలు వాసవీ పారాయణం నిర్వహించారు. ఆలయ అర్చకులు శిష్టా మణికంఠ ఆధ్వర్యంలో హోమంలు నిర్వహించారు.

జీఓ 117 రద్దు చేయాలి

భీమవరం: జీవో 117 రద్దు చేస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం ఇంతవరకు ఆ ప్రయత్నం చేయలేదని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ప్రకాశం, బి.వి.నారాయణ ప్రశ్నించారు. గతంలో సర్దుబాటు వల్ల ఉపాధ్యాయులకు ఇబ్బంది తలెత్తితే జిల్లా, మండల స్థాయి అధికారులు పరిష్కరించేవారని, ఇప్పుడు ఆ అవకాశం కూడా ఇవ్వకుండా కమిషనరేట్ నుంచి నిర్వహించడం సరైన విధానం కాదన్నారు. 10 మంది విద్యార్థుల లోపు ఉన్న పాఠశాలలను మూసివేసే ప్రయత్నం కూడా చేస్తున్నట్టు తెలుస్తోందని, ఇది విద్యారంగానికి పాఠశాలల మనుగడకు తీవ్ర హాని చేసే నిర్ణయమని ఏపీటీఎఫ్ భావిస్తుందన్నారు. తక్షణః ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని అన్ని గ్రామాలలో ప్రాథమిక పాఠశాలలు ఉండేలా, అవి సమర్థంగా నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉద్యాన పంటలకు రాయితీలు

భీమవరం: జిల్లాలో ఉద్యాన పంటల ప్రోత్సాహకానికి వివిధ పథకాల కింద రైతులకు రాయితీలు కల్పిస్తున్నామని జిల్లా ఉద్యాన శాఖాధికారి ఆర్.దేవానంద్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రకాల పూల తోటలు, కూరగాయలు, కొబ్బరి, పామాయిల్ తదితర పంటలకు రాయితీలు ఇవ్వనున్నామన్నారు. రైతులు గ్రామంలోని ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని కోరారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

ఆగిరిపల్లి : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అధైర్యపడవద్దని.. అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని నరసింగపాలెంలో టీడీపీ మూకల దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితురాలు ప్రత్తిపాటి సారమ్మను మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పరామర్శించి ధైర్యం చెప్పారు. బాధితురాలికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పంపిన రూ.50 వేల చెక్కును అందజేశారు. ప్రతి ఒక్క కార్యకర్తకు ఎలాంటి సమస్య వచ్చినా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అండగా ఉంటారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు తదితరులు పాల్గొన్నారు

క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



దాత అప్పారావుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ నటరాజారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు ఆదివారం రూ. 1,00,116 లను విరాళంగా అందజేశారు. నరసాపురానికి చెందిన కేవీసీఎస్ అప్పారావు ముందుగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని డొనేషన్ కౌంటర్‌లో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

వారణాసిలో పుట్లగట్లగూడెం వాసి అదృశ్యం



బాదరాల కోటయ్య

జంగారెడ్డిగూడెం రూరల్: పుట్లగట్లగూడెం గ్రామానికి చెందిన బాదరాల కోటయ్య (78) వారణాసిలో తప్పిపోయాడు. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 1వ తేదీన పుట్లగట్లగూడెంకు చెందిన 40 మంది కాశీ యాత్రకు బయలుదేరారు. వీరంతా స్వగ్రామం నుంచి బస్సులో విజయవాడ చేరుకుని అక్కడ నుంచి రైలులో కాశీకి బయలుదేరారు. యాత్రికులంతా ఈనెల 3న వారణాసి చేరుకున్నారు. అదేరోజు యాత్రికుల్లో ఒకరైన బాదరాల కోటయ్య తన భార్య అంజలికి ఘాట్ వద్ద పిండ ప్రధాన కార్యక్రమాన్ని నిర్వహించాడని, అందరితో కలిసి దైవదర్శనం చేసుకున్నాడని, అనంతరం శనివారం మధ్యాహ్నం నుంచి కోటయ్య కనిపించలేదని కోటయ్యతోపాటు యాత్రకు వెళ్లిన కొలూరి కృష్ణ తెలిపారు. కోటయ్య అదృశ్యంపై స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చి, యాత్రకు వచ్చిన 20 మంది వరకు వారణాశి పరిసరాల్లో కోటయ్య ఆచూకీ కోసం గాలించామన్నారు. కోటయ్య తన అన్నయ్య కుమారుడు బాదరాల వెంకటేశ్వరరావుతో కలిసి యాత్రకు వెళ్లాడు.

మహిళను మోసం చేసిన వ్యక్తి అరెస్టు

ముదినేపల్లి రూరల్: వివాహం చేసుకుంటానని మహిళను నమ్మించి సహజీవనం చేసి మోసగించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ముదినేపల్లి ఎస్సై డి వెంకటకుమార్ కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత కొన్ని కారణాలతో భర్త నుంచి విడిపోయింది. ఏడాదిన్నర కిందట ఏలూరు రూరల్ మండలం ఆగడాలలంకకు చెందిన దేవభూషణంతో పరిచయం ఏర్పడి సహజీవనం చేసింది. కొంతకాలం తరువాత దేవభూషణానికి వేరే మహిళతో సంబంధం ఉన్నట్లు తెలుసుకుని నిలదీయగా విభేదాలతో నాలుగు నెలలు కిందట విడిపోయారు. పెళ్లి చేసుకుంటానని దేవభూషణం నమ్మించి మోసం చేయడంతో పాటు తనపై నిందలు వేస్తూ సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెడుతున్నాడంటూ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని కైకలూరు కోర్టులో శనివారం హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

శ్రావణం.. శుభప్రదం

- నేటి నుంచి శ్రావణమాసం ప్రారంభం
- జిల్లాలో ముస్తాబైన అమ్మవార్ల ఆలయాలు
- నెలరోజుల పాటు విశేష పూజలు, వ్రతాలు



వరలక్ష్మి అమ్మవారు



ద్వారకాతిరుమల క్షేత్ర దేవత శ్రీకుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయం



శ్రీకుంకుళ్లమ్మ అమ్మవారు

ద్వారకాతిరుమల/బుట్టాయగూడెం: శ్రావణం శుభప్రదం.. శివకేశవులకు ప్రీతికరం.. అమ్మవారి ఆరాధనకు అనువైన మాసం. నెలరోజుల పాటు మహిళలు అత్యంత పవిత్రంగా పూజలు, వ్రతాలు జరుపుకునే ఈ మాసం సోమవారం నుంచి ప్రారంభం కానుంది. దీంతో జిల్లా వ్యాప్తంగా అమ్మవార్ల ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ఈ క్రమంలో ద్వారకాతిరుమల క్షేత్ర దేవతగా విరాజిల్లుతోన్న శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయాన్ని దేవస్థానం సిబ్బంది శోభాయమానంగా అలంకరించారు. నెల రోజులపాటు ఆలయంలో అమ్మవారికి అర్చకులు, పండితులు విశేష కుంకుమ పూజలు, ప్రతి శుక్రవారం చండీ హోమాన్ని నిర్వహించనున్నారు. అలాగే ఈమాసంలో ఒకరోజు శ్రీవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను అట్టహాసంగా నిర్వహిస్తారు.

ప్రతి ఇంటా ఆధ్యాత్మిక శోభ

చంద్రుడు శ్రవణా నక్షత్రానికి సమీపంలో సంచరించే పుణ్యకాలమే శ్రావణమాసం. శ్రీ మహావిష్ణువు జన్మనక్షత్రం శ్రవణ నక్షత్రం కావడంతో ఈ మాసం అమ్మవారికి ఎంతో ప్రీతికరమైనది. ఈ మాసంలో భక్తుల కోర్కెలను అమ్మవారు తప్పక వింటుందని, పూజలకు ప్రతిఫలం రెట్టింపుగా లభిస్తుందని పండితులు చెబుతున్నారు. ఈ మాసంలో జరిగే పూజలు, వ్రతాలతో పాటు నాగులచవితి, పంచమి, రాఖీపౌర్ణమి, శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగలతో ప్రతి ఇంటా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తుంది.

ప్రతి రోజుకూ ప్రాధాన్యత

ఈ మాసంలో ప్రతి రోజుకు ఒక ప్రాధాన్యత ఉంది. ఆదివారం సూర్యారాధన, సోమవారం శివారాధన, మంగళవారం మంగళగౌరీ ఆరాధన, బుధవారం మహావిష్ణువు ఆరాధన, గురువారం దత్తాత్రేయుడి పూజ, శుక్రవారం లక్ష్మీదేవి పూజ, శనివారం దుర్గాదేవి పూజ చేసే వారికి తప్పక శ్రావణమాస పుణ్యఫలం లభిస్తుందని, ధన, కనక, వస్తు, ఆయుష్షు, ఆరోగ్యం, ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని పండితులు చెబుతున్నారు.

మంగళగౌరీ వ్రతం

కొత్త కోడళ్ల తమ మాంగల్యాన్ని పదికాలాలపాటు చల్లగా చూడాలని అమ్మవారిని కోరుతూ వివాహమైన సంవత్సరం నుంచి ఐదేళ్లపాటు ఆచరించే వ్రతం మంగళ గౌరీ వ్రతం. మాంగల్యానికి అధిదేవత గౌరీదేవిని ఈ మాసంలో ప్రతి మంగళవారం భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తారు. వివాహమైన మొదటి సంవత్సరం పుట్టింట్లో, ఆ తరువాత నాలుగేళ్లు అత్తవారింట్లో ఈ వ్రతాన్ని జరుపుకుంటారు. ఈ వ్రతాన్ని ఆచరించడం వల్ల మహిళలకు సౌభాగ్యం కలకాలం నిలుస్తుందని పండితులు చెబుతున్నారు.

ప్రతి శుక్రవారం ప్రత్యేకమే

ఈ నెలలో వచ్చే ప్రతి శుక్రవారం వ్రతాలకు, నోములకు కేటాయించడం వెనుక పెద్ద కథ ఉన్నట్లు పురాణాలు చెబుతున్నాయి. కలియుగ దైవం శ్రీవెంకటేశ్వరస్వామి నక్షత్రం కూడా శ్రవణం కావడం వల్ల ఆయన భార్య లక్ష్మీదేవికి, సోదరి గౌరీదేవికి శ్రావణ శుక్రవారాల్లో మహిళలు పూజలు చేస్తారు. శ్రావణ పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం నాడు వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు.

నెలంతా పండుగల సందడి

శ్రావణమాసంలో ముఖ్యమైన పండుగలతో సందడి నెలకొంటుంది. ఈ నెల 9న తొలి శుక్రవారం, 11వ తేదీన భానుసప్తమి, 16న రెండో శుక్రవారం వరలక్ష్మీ, 19న రాఖీ పౌర్ణమి, జంధ్యాల పౌర్ణమి, 26న శ్రీకృష్ణ జన్మాష్టమి వంటి ముఖ్యమైన పండుగలు ఈ మాసంలోనే ఉన్నాయి.

100 రోజుల తర్వాత మళ్లీ శుభ ముహూర్తాలు

శుక్రమౌఢ్యం, ఆషాఢమాసంతో వంద రోజుల తర్వాత మళ్లీ 7 నుంచి 28వ తేదీ వరకు శుభ కార్యాలకు అనుకూలమైన ముహూర్తాలు ఉన్నాయని పురోహితులు చెబుతున్నారు. శ్రావణ మాసంలో వ్రతాలతోపాటు పెళ్ళిళ్లు, గృహ ప్రవేశాల వంటి శుభకార్యాలకు మంచిది. ముఖ్యంగా ఆగస్టు నెలలో 7, 8, 9, 11, 15, 17, 18, 19, 22, 23, 28 తేదీల్లో పెళ్లి ముహూర్తాలు ఉన్నట్లు పురోహితులు చెబుతున్నారు. ఈ నెలలో జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో పెళ్లిళ్ల జరిగే అవకాశం ఉంది.

శ్రావణమాసానికి విశేష ప్రాధాన్యం



సకల సుఖాలనొసగే శ్రావణం జ్ఞానాన్ని అందిస్తుంది. హరిహర భేదం లేదని నిరూపించే శ్రావణమాసంలో వైష్ణవ ఆరాధనతోపాటు మహాశివునికి పెద్ద ఎత్తున రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. ముఖ్యంగా వివాహాది శుభకార్యాలకు మంచి ముహూర్తాలు ఉన్నాయి.
– అనిపెద్ది వెంకటరామకృష్ణ శర్మ, పురోహితులు, బుట్టాయగూడెం

పోలీస్ సిబ్బంది పిల్లలకు భరోసా



ఎస్పీ శివకిషోర్ నుంచి స్కాలర్‌షిప్స్ అందుకున్న పోలీస్ సిబ్బంది పిల్లలు

- జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్
- 35 మంది మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందజేత

ఏలూరు టౌన్: ఆధునిక సమాజంలో విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవటం కష్టమేమీ కాదనీ, ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని వాటి సాధనకు శ్రమించాలని ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్‌శాఖలో పనిచేస్తున్న సిబ్బంది కుమారులు, కుమార్తెల ఉన్నత చదువులకు అండగా నిలుస్తూ ప్రతిభావంతులైన వారికి ఏపీ పోలీస్ వెల్ఫేర్ సంఘం సహకారంతో నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలను ఆదివారం జిల్లా పోలీసు శాఖ కార్యాలయంలో ఎస్పీ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది కుటుంబాలు, వారి పిల్లలతో ఎస్పీ కొద్దిసేపు గడిపారు. ఐఐటీ, ఎంబీబీఎస్, ఇంటర్, టెన్త్‌లో ప్రతిభ చాటుకున్న 32 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను ఆయన అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ తమ ప్రతిభను చాటుకుంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. తమ పిల్లలు గొప్పగా ఎదిగితే అదే ఆనందంలో పోలీస్ సిబ్బంది మరింత మెరుగైన సేవలను ప్రజలకు అందిస్తారని చెప్పారు. పోలీస్ సంక్షేమానికి తాను నిత్యం కృషి చేస్తానని చెప్పారు.

ఆకివీడులో జ్వరాల కలకలం

ఆకివీడు: మండలంలోని రెండు గ్రామాల్లో వేర్వేరు వ్యక్తులకు ఇన్‌ఫ్లుయెంజా ఫీవర్ సోకినట్లు వైద్యులు గుర్తించారు. ఆకివీడులోని మిద్దేవారి వీధిలో 22 ఏళ్ల యువకుడికి, కోళ్లపర్రులో మరో వ్యక్తికి ఇన్‌ఫ్లుయెంజా ఫీవర్ వచ్చిందని, శ్వాసకోశ సంబంధ ఇబ్బందులతో రోగి ఉంటాడని, కరోనా పోలిన లక్షణాలు ఉంటాయని తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. వీరు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యం పొందుతున్నారు. ఆ ప్రాంతాల్లో ఆదివారం పారిశుద్ధ్య పనులు మెరుగుపరిచారు. చుట్టుపక్కల ప్రజలు మాస్కుతో తిరగాలని వైద్యులు సూచించారు.

ఎర్రకాలువ వాగులో మహిళ మృతదేహం లభ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: పంగిడిగూడెం వద్ద ఎర్రకాలువ వాగులో ఆదివారం ఒక మహిళ మృతదేహం లభ్యమైంది. జంగారెడ్డిగూడెం ఎస్సై జ్యోతిబాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎర్రకాలువ వాగు వద్ద చేపలు పడుతున్న వారికి మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్సై ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతురాలు ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురం గ్రామానికి చెందిన పంపన వెంకాయమ్మ (50)గా గుర్తించారు. నాలుగు రోజులుగా వెంకాయమ్మ ఇంటి నుంచి బయటకు వెళ్లి కనిపించకపోవడంతో ఆమె కోసం కుటుంబ సభ్యులు, బంధువులు వెతుకుతున్నారు. మతిస్థిమితం లేక గతంలో అనేక మార్లు వెంకాయమ్మ ఇంటి నుంచి బయటకు వెళ్లడం, గుళ్ల వద్ద ఉండి తిరిగి ఇంటికి వెళ్లిపోవడం చేస్తుండేది. ఇదే కోవలో ఇంటి నుంచి వచ్చిన వెంకాయమ్మ వాగులో ప్రమాదవశాత్తు పడి మృతి చెంది ఉండవచ్చని అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై జ్యోతిబాస్ తెలిపారు.

తల్లిదండ్రులు చెంతకు బాలుడు



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

కాళ్ల: అల్లరి చేస్తున్నాడని మందలించడంతో భయపడి ఇంటి వెళ్లి తప్పిపోయిన ఓ బాలుడిని వెతికి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించినట్లు కాళ్ల ఎస్సై వీరభద్రరావు ఆదివారం చెప్పారు. వివరాలి ఉన్నాయి. ఏలూరుపాడుకు చెందిన ఓ బాలుడు తల్లి మందలించిందని శనివారం ఉదయం ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా ఆదివారం భీమవరంలో అతడి ఆచూకీ లభ్యమైంది. దీంతో పోలీసులు అక్కడి వెళ్లి బాలుడిని తీసుకువచ్చి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించారు. 24 గంటలలోపే బాలుడి ఆచూకీ కనిపెట్టిన ఎస్సై, కానిస్టేబుల్స్ మహేంద్రదీప్, సురేష్‌లను పలువురు గ్రామ పెద్దలు అభినందించారు.

పేరుపాలెం బీచ్‌లో ఇంటర్ విద్యార్థి గల్లంతు



జాన్‌బాబు (ఫైల్)

నరసాపురం రూరల్/తణుకు: స్నేహితులతో కలిసి సముద్ర స్నానానికి వెళ్లగా, అలల తాకిడికి ఓ యువకుడు గల్లంతయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. తణుకు పాతవూరుకు చెందిన కొల్లు జాన్‌బాబు తణుకులోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. స్నేహితుల దినోత్సవం కావడంతో ఆదివారం ఆరుగురు మిత్రులతో కలిసి పేరుపాలెం బీచ్‌కు వెళ్లాడు. సముద్ర స్నానం చేస్తూ అలల ఉధృతికి వీరిలో కొల్లు జాన్‌బాబు (17) గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గల్లంతైన జాన్‌బాబు కోసం గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. జాన్‌బాబు తండ్రి బాబూరావు తణుకులో చెప్పులు కుట్టుకుంటూ జీవిస్తున్నాడు. తల్లి మరియమ్మ గృహిణి కాగా, చెల్లి ఎనిమిదో తరగతి చదువుతోంది. ఆదివారం రాత్రి వరకు జాన్‌బాబు ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు తోటి స్నేహితులు వెల్లడించారు.

టీడీపీ నేతల తప్పుడు ఫిర్యాదులపై సర్వత్రా విస్మయం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు, నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు, అప్పటి అధికారులపై తప్పుడు ఫిర్యాదులు చేస్తూ ఇబ్బంది పెట్టాలని చూస్తోంది. దీనిలో భాగంగా ఎప్పుడో జరిగిన భూవివాదంపై ఆదివారం నూజివీడు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో టీడీపీకి చెందిన పట్టణంలోని చిన్నం లక్ష్మీనరసింహారావు అనే వ్యక్తి అధికారులపై, భూయజమానిపై, మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, ఆయన తనయుడు, ప్రభుత్వ సిబ్బందిపై తప్పుడు ఫిర్యాదు చేశారు. అయితే దీనికి సంబంధించి వాస్తవాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని గొడుగువారిగూడెంలోని సర్వే నంబర్ 127/2లో ఎ.29.58సెంట్లు భూమి మేకా రామ్మోహన్ అప్పారావు తన సోదరి అయిన కాకుమాను స్రవంతీదేవికి వీలునామా రిజిస్టర్ చేశారు. దీంతో స్రవంతీదేవి ఏ.29.58సెంట్ల భూమి తనకు అప్పగించాలని ఆర్డీఓ కోర్టులో కేసు వేయగా ఆమెకు అనుకూలంగా ఉత్తర్వులు ఇచ్చింది. ఆ తరువాత భూమిలో ఉన్న వారు జాయింట్ కలెక్టర్ కోర్టుకు వెళ్లగా అక్కడ కూడా స్రవంతీదేవికి అనుకూలంగా ఉత్తర్వులు వచ్చాయి. దీంతో లక్ష్మీనరసింహారావు జాయింట్ కలెక్టర్ కోర్టు ఉత్తర్వులపై హైకోర్టుకు వెళ్లగా హైకోర్టు కూడా ఆర్డీఓ, జేసీ కోర్టుల్లో ఇచ్చిన ఉత్తర్వులనే కన్ఫర్మ్ చేసి ఏమైనా ఉంటే సివిల్ కోర్టులో అప్పీలు చేసుకోవాలని రెండు నెలలు గడువిచ్చింది. కేసు పెట్టిన వ్యక్తులు కింది కోర్టులో అప్పీలు చేయకుండా దీనిపై హైకోర్టులోనే రిట్ అప్పీలు వేశారు. ఈ అప్పీలు బెంచ్‌పై పెండింగ్‌లో ఉంది. వాస్తవం ఇలా ఉండగా మళ్లీ రికార్డులు మార్చరని, అధికార దుర్వినియోగం చేశారంటూ తప్పుడు ఆరోపణలు చేస్తూ కేసు పెట్టడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.

కుక్కల వివాదంపై దాడి.. భార్యాభర్తలకు గాయాలు

భీమడోలు: పెంపుడు కుక్కలు కనిపించకపోవడంతో ఏర్పడిన వివాదం ఘర్షణకు దారి తీసిన ఘటనలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. గుండుగొలను ఎస్సీ కాలనీకి చెందిన మువ్వల నిర్మల, మువ్వల రాంబాబు భార్యాభర్తలు. వీరి పెంపుడు కుక్కలు కనిపించడం లేదు. అదే ప్రాంతానికి చెందిన సత్తా పోతురాజు స్నేహితులతో కలిసి సినిమా చూసి శనివారం రాత్రి తిరిగి వస్తుండగా వారిపై కుక్కలు దాడి చేయగా, వాటిని తరిమేశారు. దీంతో తమ కుక్కల అదృశ్యం వెనుక పోతురాజు పాత్ర ఉందనే అనుమానంతో నిర్మల, రాంబాబు ఆతనితో గొడవ పడ్డారు. దీంతో ఆదివారం పోతురాజు ఆగ్రహంతో నిర్మలపై దాడి చేసి ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించడమే కాక దుర్భాలాషలాడాడు. అదే సమయంలో వచ్చిన రాంబాబు పోతురాజును అడ్డుకోగా, సిమెంట్ రాయితో దాడి చేయడంతో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోతురాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

బైక్ ఢీకొని బాలుడికి తీవ్ర గాయాలు



గాయాలతో ఉన్న పవన్

దెందులూరు: మద్యం మత్తులో బైక్‌పై వేగంగా వెళుతూ మరో బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఓ బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. కొవ్వలి నుంచి పవన్ అనే బాలుడు ద్విచక్రవాహనంపై దెందులూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళుతున్నాడు. దెందులూరులో బస్టాండ్ సెంటర్ వద్దకు వచ్చేసరికి సుభాష్ అనే వ్యక్తి మద్యం మత్తులో వేగంగా వస్తూ పవన్ బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో బాలుడు పవన్‌కు తీవ్ర గాయాలు కాగా, అతనిని అదే సమయంలో అటుగా వెళుతున్న స్థానికులు, కానిస్టేబుల్ మధు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా, మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు తరలించారు.

పేకాట స్థావరంపై దాడి.. ఆరుగురి అరెస్టు

భీమడోలు: అంబర్‌పేటలో ఓ తోటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు ఆదివారం రాత్రి ఆకస్మిక దాడికి చేశారు. ఈ దాడిలో టీడీపీకి చెందిన ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా, మరికొంతమంది పరారయ్యారు. నిందితుల నుంచి రూ.8,450 నగదు, 10 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై వై.సుధాకర్ మాట్లాడుతూ నిందితులపై కొత్త చట్టాల ప్రకారం కేసు నమోదు చేశామని, దీని ప్రకారం పేకాట ఆడుతూ పట్టుబడితే ఏడేళ్ల వరకు శిక్ష పడే అవకాశం ఉందన్నారు.

చోరీ కేసులో నలుగురి అరెస్ట్



నిందితులతో పోలీసులు


కామవరపుకోట: ప్రైవేటు విద్యాసంస్థల బస్సుల టైర్లు, బ్యాటరీ చోరీ కేసులో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై జయబాబు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. కామవరపుకోట రెండు ప్రైవేటు విద్యాసంస్థల బస్సులకు ఉన్న 8 టైర్లు, రెండు బ్యాటరీలు, ఒక జాకీ ఈ నెల 28న రాత్రి చోరీకి గురయ్యాయి. బస్సు యజమాని నందిగామ ధర్మరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర, సీఐ ఈ రాజేష్ ఆధ్వర్యంలో ఎస్సై జయబాబు దర్యాప్తు చేపట్టారు. ఈనెల 3న తడికలపూడిలో విజయ మిల్క్ డైరీ వద్ద కామవరపుకోట మండలానికి చెందిన నిందితులు కుచ్చులపాటి చందు, కొల్లా ఈశ్వర్ కుమార్, పొలగాని సాయి దుర్గారావు, బొడ్డు వెంకటను అరెస్టు చేసి, రూ.1.20 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

దుఃఖదాయినిగా నక్కల డ్రెయిన్

- గోదావరికి వరద పోటెత్తితే నష్టపోతున్న ఐదు మండలాల రైతులు
- ఏటా 60 గ్రామాల్లో వేల ఎకరాల్లో మునుగుతున్న చేలు, ఆక్వా చెరువులు
- పనిచేయని స్లూయిజ్.. నక్కల డ్రెయిన్‌లోకి ఎగదన్నుతున్న వరద నీరు
- వడ్డిలంక అవుట్‌ఫాల్ స్లూయిజ్ నిర్వహణ గాలికి వదిలివేసిన అధికారులు



వడ్డిలంక వద్ద పూర్తిగా తెరుచుకోని డ్రెయిన్ అవుట్‌ఫాల్ స్లూయిజ్ తలుపులు



నక్కల డ్రెయిన్ పొంగడం వలన గుంపర్రులో నీటమునిగి గోదావరిని తలపిస్తున్న వరిచేలు (ఫైల్)

యలమంచిలి: రైతులపాలిట దుఃఖదాయినిగా నక్కల డ్రెయిన్ మారింది. ప్రతి సంవత్సరం అధిక వర్షాలు, వరదల సమయంలో గోదావరిలోని వరద నీరు నక్కల డ్రెయిన్‌లోనికి ఎదురురావడం వలన యలమంచిలి, పోడూరు, ఆచంట, పెనుగొండ, పెరవలి మండలాల్లోని వేలాది ఎకరాల వరి, ఆక్వా చెరువులు దెబ్బతింటున్నాయి. అయిన పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

మూడు డ్రెయిన్లు కలిసి..

నక్కల డ్రెయిన్ ప్రధానమైనది కాగా, దీనిలో మరొక రెండు మైనర్ (వల్లూరు, తాడేరు) డ్రెయిన్ల నీరు వచ్చి కలుస్తుంది. పెరవలి మండలం కాకరపర్రు లాకుల వద్ద ప్రారంభమైన నక్కల డ్రెయిన్ సుమారు 40.800 కిలోమీటర్ల మేర ప్రవహించి వడ్డిలంక వద్ద అవుట్‌ఫాల్ స్లూయిజ్ దాటి యలమంచిలిలంక, లక్ష్మీపాలెం గ్రామాల సరిహద్దుల మధ్య గోదావరిలో కలుస్తుంది. ఆచంట మండలం కొడమంచిలి వద్ద ప్రారంభమైన వల్లూరు డ్రెయిన్ 12.850 కిలోమీటర్లు ప్రవహించి కట్టుపాలెం వద్ద నక్కల డ్రెయిన్‌లో కలుస్తుంది. అలాగే పెనుగొండ మండలం నడిపూడి వద్ద ప్రారంభమైన తాడేరు డ్రెయిన్ ఆచంట మండలం మీదుగా 12.875 కిలోమీటర్లు ప్రవహించి పోడూరు మండలం వద్దిపర్రు వద్ద నక్కల డ్రెయిన్‌లో కలుస్తుంది. ఐదు మండలాల పరిధిలో ఉన్న ఈ మూడు డ్రెయిన్‌లలో సుమారు 100 గ్రామాల మురుగు కలుస్తుండగా, ఈ డ్రెయిన్ నీటిపై ఆధారపడి సుమారు 60 వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉంది.

స్లూయిజ్‌తో సమస్యలు

నక్కల డ్రెయిన్‌కు వడ్డిలంక వద్ద 1880లో బ్రిటీష్ కాలంలో స్లూయిజ్ నిర్మించారు. ఈ స్లూయిజ్ తలుపులు స్క్రూ టైప్ (మ్యాన్ హోల్ ఆపరేటింగ్) కావడం, తలుపులు చిన్నవిగా ఉండటంతో డ్రెయిన్‌లో నీరు గోదావరిలోకి మళ్లించేందుకు ఎక్కువ సమయం తీసుకునేది. దీంతో 1992లో కొత్త స్లూయిజ్ నిర్మాణం ప్రారంభించి 1998లో పూర్తి చేశారు. ఈ స్లూయిజ్‌ను ఆటోమెటిక్ షట్టర్స్ డిజైన్‌లో నిర్మించారు. ఈ పద్ధతిలో డ్రెయిన్ అడుగు భాగంలో (బాటం టైర్) ఆరు షటర్స్, పై భాగంలో (టాప్ టైర్) ఆరు షటర్స్ ఉంటాయి. ఇవి డ్రెయిన్‌లో నీరు ఎక్కువగా ఉన్న సమయంలో మానవ ప్రమేయం లేకుండా ఆటోమేటిక్‌గా పైకి లేచి నీరు గోదావరిలోనికి వేగంగా ప్రవహించేలా చేస్తుంది. వరద సమయంలో గోదావరిలో నీరు డ్రెయిన్‌లోనికి రాకుండా ఆటోమేటిక్‌గా షట్టర్స్ మూసుకుపోతాయి. ఈ షట్టర్స్ సక్రమంగా పనిచేసినంత కాలం సమస్య రాలేదు.

నిర్వహణ లోపం వలనే..

నక్కల డ్రెయిన్ అవుట్‌ఫాల్ స్లూయిజ్ నిర్వహణను అధికారులు నిర్లక్ష్యంగా వదిలివేయడంతో స్లూయిజ్ షటర్స్ సక్రమంగా పనిచేయడం క్రమంగా మందగించింది. ముఖ్యంగా షట్టర్లకు, కాంక్రీట్ వాల్స్‌కు అనుసంధానంగా ఉండే ఇనుప బీమ్ తుప్పు పట్టి పాడై తలుపులు ఊడిపోతున్నాయి. వాటికి వెల్డింగ్ చేయిస్తున్నా పట్టు ఉండడం లేదు. దీంతో ప్రతి ఏడాది అధిక వర్షాలు, వరదల సమయంలో క్రేన్ తీసుకువచ్చి ఇనుప గొలుసులతో తలుపులు పైకి లేపి కడుతున్నారు. అయినా తలుపులు పూర్తిగా తెరచుకోవడం లేదు. ముఖ్యంగా 10 రోజుల క్రితం అడుగు భాగం (బాటం టైర్)లో ఉండే ఒక తలుపు పూర్తిగా ఊడిపోయింది. దీంతో కాజ డ్రెయిన్ నుంచి పాత షటర్ ఒకటి తీసుకు వచ్చి అడ్డుగా పెట్టిన ఫలితం లేకపోయింది. డ్రెయిన్‌లోనికి గోదావరి వరద నీరు ఎగదన్నడం వలన 60 గ్రామాల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.

శాశ్వత పరిష్కారమెప్పుడో?

షట్టర్లకు, కాంక్రీట్ వాల్స్‌కు అనుసంధానంగా ఉండే ఇనుప బీమ్ తుప్పు పట్టడం వలన ఈ సమస్యకు పూర్తిగా పరిష్కరించడం కష్టమనేది నిపుణుల మాట. అయితే షట్టర్ తుప్పు పట్టకుండా స్టెయిల్ లెస్ స్టీల్ రేకు అతికించి, స్పెషల్ కాంక్రీట్‌తో బీమ్ నిర్మించడం ద్వారా సమస్యను కొంతవరకు అడ్డుకోగలమని అధికారులు చెబుతున్నారు. ఈ విధంగా చేసి ప్రతి ఏడాదీ మే నెలలో క్రమం తప్పకుండా 12 షట్టర్లకు నిర్వహణ చేస్తే సమస్య తీవ్రం కాకుండా నివారించవచ్చని సూచిస్తున్నారు. ముఖ్యంగా అనుభవజ్ఞుడైన అధికారిని ఇక్కడ నియమించి, ప్రతి సంవత్సరం నిర్వహణకు నిధులు కేటాయిస్తేనే రైతులకు ముంపు బాధ తప్పుతుందని తేల్చి చెబుతున్నారు.

క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయం



హర్షం వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తణుకు టౌన్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుని స్వాగతిస్తూ తణుకు పట్టణం వీరభద్రపురంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అభినందనోత్సవం నిర్వహించారు. గత 30 ఏళ్లుగా సామాజిక న్యాయం కోసం మందా కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో మాదిగలు చేసిన పోరాటాన్ని గుర్తించిన సుప్రీం కోర్టు సామాజిక న్యాయం వైపు నిలిచిందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దూలపల్లి బ్రహ్మాజీ, మల్లిపూడి సుధాకర్‌బాబు, మల్లిపూడి నరేష్, మల్లిపూడి ప్రసాద్, హర్షవర్ధన్ పాల్గొన్నారు.

యువకుల మధ్య గొడవ

పాలకోడేరు: పని చేసే చోట రెండు వర్గాలకు చెందిన యువకుల మధ్య వచ్చిన తగాదా రెండు కులాల ఘర్షణగా రూపుదాల్చి, కొట్టుకునే పరిస్థితి వరకూ వెళ్లింది. వివరాలు ఇలా ఉన్నాయి. పాలకోడేరుకు చెందిన ఎస్సీ, బీసీ సామాజిక వర్గానికి చెందిన యువకులు భీమవరంలోని ఒక రొయ్యల కంపెనీలో పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో యువకుల మధ్య కొద్ది రోజుల క్రితం ఘర్షణ ఏర్పడింది. దీంతో ఆదివారం బీసీ సామాజిక వర్గానికి చెందిన కొంతమంది యువకులు ఎస్సీ సామాజిక వర్గం యువకులపై దాడి చేయడంతో అభిరామ్ అనే యువకుడికి గాయం అయింది. గాయపడిన యువకుడు భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దాడి చేసిన బీసీ సామాజిక వర్గం యువకులు పోలీస్ స్టేషన్‌కు చేరుకోవడంతో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన యువకులు కూడా పోలీస్ స్టేషన్‌కు చేరుకుని లోపల ఉన్న వారిని బయటికి పంపించాలని గొడవ చేయడంతో పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీసింది. భీమవరం నుంచి సీఐ ఆధ్వర్యంలో పోలీసులు రంగ ప్రవేశం చేసి 9 మంది యువకులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

మద్యం కేసులో ఇద్దరి అరెస్టు

పాలకోడేరు: అక్రమ మద్యం కలిగి ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు పాలకోడేరు పోలీసులు తెలిపారు. వీరిని పెన్నాడలో పట్టుకున్నట్లు ఆ మద్యం యానాం నుంచి తీసుకు వచ్చినట్లు తెలిపారు. వీటి విలువ రూ.4,902 అని ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

మేత బస్తాలు, కోళ్లు చోరీ

ఉండి: ఆక్వా చెరువు వద్ద రొయ్యల మేతబస్తాలు, కోళ్ల దొంగతనంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం కోలమూరుకు చెందిన నంద్యాల ఉదయ భాస్కరరావు అనే ఆక్వా రైతు చెరువులో మేత వేసేందుకు 20 బస్తాలను గత నెల 28వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో తెచ్చుకుని తన ఇంటి వెనుక వాటిని భద్రపరచాడు. అయితే తెల్లవారిన తరువాత అనగా 29వ తేదీ ఉదయం చూసే సరికి 20 బస్తాలతో పాటు అక్కడే ఉన్న ఆరు పెంపుడు కోళ్లు కూడా కనిపించకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై ఎస్సై ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అసభ్య ప్రవర్తనపై కేసు నమోదు

ఉండి: మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చెరుకువాడ చినపేటకు చెందిన ఓ మహిళ పట్ల అదే ప్రాంతానికి చెందిన బొడ్డు మంగరాజు అనే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించడంతో పాటుగా ఆమె కనిపించిన ప్రతీ సారి ఆమెను వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని సదరు మహిళ తన భర్తకు చెప్పడంతో గత నెల 17వ తేదీన అతనిని అడిగేందుకు వెళ్లిన భర్తపై అతడు దాడి చేసినట్లు మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్సై ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతులకు సబ్సిడీపై విత్తనాలు

నరసాపురం రూరల్: డివిజన్‌లోని నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి మండలాల్లో ఇటీవల కురిసిన అధిక వర్షాలు, వరదలకు నారుమడులు నష్టపోయిన రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందిస్తున్నట్లు ఏడీఏ ఈదా అనిల్‌కుమారి తెలిపారు. డివిజన్ పరిధిలో 390.37 ఎకరాలకు సంబంధించిన నారుమడులు పాడైనట్లు గుర్తించామన్నారు. వీరందరికి 80 శాతం రాయితీతో ఎంటీయూ 1153 రకం విత్తనాలను రైతు సేవా కేంద్రాల ద్వారా అందించనున్నట్లు ఆమె ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 30 కిలోల విత్తనాల బస్తా పూర్తి ఖరీదు రూ.1,134 కాగా 80 శాతం రాయితీ ధర రూ.907 తగ్గించి కేవలం రూ.227లకు ప్రభుత్వం ద్వారా అందజేస్తున్నట్లు తెలిపారు. మంపునకు గురైన నారుమడులు కలిగిన రైతులు ఈ ఎంటీయూ 1153 వరి రకాన్ని ఊడ్చుకోవలసిందిగా ఆమె పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు గ్రహణం

- అరకొరగా పథకాలు అమలు
- పూర్తిస్థాయిలో అందని విద్యా సామగ్రి
- ఉపాధ్యాయుల కొరత
- విద్యార్థులకు హైరానా



ఉపాధ్యాయుల కొరత ఉన్న అత్తిలి ఎంపీయూపీ బాయ్స్ స్కూల్

తణుకు/తణుకు అర్బన్/తణుకు టౌన్/అత్తిలి/ఇరగవరం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. పేదింటి పిల్లలకు ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలూ కల్పించారు. హాజరు శాతం పెంచేందుకు జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద వంటి పథకాలను పక్కాగా అమలు చేశారు. పేదలందరికీ విద్యనందించాలనే సదుద్దేశంతో అమ్మఒడి పథకాన్ని అమలు చేశారు. ఐతే.. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక జగన్ ప్రవేశపెట్టి అమలు చేసిన పథకాలన్నిటికీ పేరు మార్చి, అరకొరగానే అమలు చేస్తున్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విద్యాసంవత్సరం జూన్ నెల 13న పాఠశాలలు పునఃప్రారంభమైనప్పటికీ ఇంత వరకు విద్యార్థులకు సరిపడా పుస్తకాలు, యూనిఫామ్, షూస్, టై వంటివి అందుబాటులోకి రాకపోవడం శోచనీయం. ఇప్పటికీ పూర్తిస్థాయిలో పుస్తకాలు లేక విద్యార్థులు హైరానా పడుతున్నారు. తల్లితండ్రులు, విద్యార్థుల మన్ననలు పొందుతూ నడిచిన జగనన్న గోరుముద్ద సైతం సక్రమంగా అమలు కావడంలేదని, గతంలో మాదిరిగా ఆహార పదార్థాలు నాణ్యంగా ఉండడంలేదని విద్యార్థులే చెబుతున్నారు. తణుకు నియోజకవర్గంలోని తణుకు మున్సిపాల్టీతోపాటు తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల పరిధిలోని మొత్తం 155 పాఠశాలల్లో 17,631 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలల్లో సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో చదువులో వెనుకబడిపోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు.

ఉపాధ్యాయుల కొరత

తణుకు మండలం మండపాక, దువ్వ గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఇద్దరు చొప్పున ఉపాధ్యాయుల కొరత ఉంది. దువ్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ, బయాలజీ సబ్జెక్ట్‌లకు సంబంధించిన ఉపాధ్యాయులు మే, జూన్ నెలల్లో రిటైర్డ్ కావడంతో వారి స్థానంలో కొత్తవారిని నియమించలేదు. మండపాక గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం, పీఎస్ ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉండటంతో పాఠశాల నిర్వహణ ఇన్‌చార్జీలతో నిర్వహిస్తున్నారు. తణుకు మండలంలో నాలుగు, అత్తిలి మండలంలో ఆరు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

విద్యార్థులకు ఇబ్బందులు



విద్యార్థులకు అందాల్సిన పుస్తకాలు, యూనిఫామ్ వంటి సౌకర్యాలు ఇప్పటికీ అందకపోవడం చాలా బాధాకరం. మధ్యాహ్న భోజన పథకం కూడా అస్తవ్యస్తంగా నడుస్తోందని, అన్నం కూరల్లో నాణ్యతలోపించిందని విద్యార్థులే చెబుతున్నారు. గత ఐదేళ్ల కాలంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఇటువంటి ఇబ్బంది ఎప్పుడూ రాలేదు. విద్యార్థులకు అందాల్సిన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి.

– ఝాన్సీ లారెన్స్, తణుకు

ప్రాధాన్యత తగ్గిన ప్రభుత్వ విద్య

పెంటపాడు: తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ప్రభుత్వ విద్యకు ప్రాధాన్యత తగ్గింది. ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు కావడంలేదు. పలువురు విద్యార్థులకు బూట్లు, స్కూల్ బ్యాగులు అందలేదు. ఫలితంగా విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పెంటపాడు మండలంలోని 68 పాఠశాలల్లో 5134 మంది, తాడేపల్లి గూడెం మండలంలోని 100 పాఠశాలల్లో 9864 మంది, తాడేపల్లిగూడెం పట్టణంలోని ఏడు పాఠశాలల్లో నాలుగు వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇటీవల బదిలీల నేపథ్యంలో పలు హైస్కూళ్లలో ఉపాధ్యాయులు కొరత ఏర్పడింది. పెంటపాడు మండలంలో ఇంగ్లీషు, గూడెంలో లెక్కలు, పీఈటీ, పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వంట ఏజెన్సీల ద్వారా పంపిణీ చేస్తున్న భోజనం బాగానే ఉన్నా.. ఒక్కోసారి చిమిడిన అన్నం వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. చిమిడిన అన్నాన్ని పారబోస్తున్నారు. జగనన్న ప్రభుత్వంలో ఉన్న మెనూ కొనసాగుతోంది. విద్యార్థులకు జగనన్న విద్యాకానుకలో భాగంగా స్కూళ్లు తెరిచిన రెండు మూడు రోజుల్లోనే కిట్లు అందేవి. ఈ విద్యాసంవత్సరం ఇప్పటికీ పెంటపాడు ప్రభుత్వ బేసిక్ పాఠశాలలో 10 మంది విద్యార్థులకు బూట్లు అందలేదు. పలువురికి స్కూలు బ్యాగులు లేవు. ఈ సమస్య పలు స్కూళ్లలోనూ నెలకొంది. స్కూళ్లలో పరిశుభ్రతను గాలికొదిలేశారని విద్యార్థుల తల్లి తండ్రుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. మధ్యాహ్న భోజన పథకంలో వంట ఏజెన్సీ మహిళలకు కూటమి ప్రభుత్వం మంగళం పాడుతుందమోనని ఏజెన్సీ మహిళలు ఆందోళన చెందుతున్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



తణుకులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



పరిమెళ్ల జెడ్పీ స్కూల్లో పూర్వ విద్యార్థులు

తణుకు: స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తణుకు మండలం వెంకట్రాయపురం తిమ్మరాజు ఉన్నత పాఠశాలలో 1995–96 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులంతా ఆదివారం ఒకచోట కలుసుకున్నారు. పాతవూరులోని షాదీఖానాలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారంతా గతస్మృతులను స్మరించుకుంటూ ఒకరినొకరు పలకరించుకున్నారు. కుటుంబ సభ్యులతో సహావచ్చిన వీరంతా ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమానికి మహ్మద్ వలీబాబు, రఘు, బాలాజీ, రాజేంద్ర, విజయ, లీల, ప్రశాంతి, గాయత్రి తదితరులు నాయకత్వం వ్యవహరించారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా

పెంటపాడు: పరిమెళ్ల జెడ్పీ స్కూల్లో పదో తరగతి 2013–14 సంవత్సరం బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు స్కూల్ ఆవరణలో ఉత్సాహంగా గడిపారు. పదేళ్ల తరువాత వారంతా ఆత్మీయ సమావేశం ఏర్పాటుచేసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తమకు విద్యనేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. సహపంక్తి భోజనాలు చేశారు.

వరి విత్తనాలు సిద్ధం

యలమంచిలి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, వరదలకు నష్టపోయిన రైతులకు 80 శాతం సబ్సిడీపై వర విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి చిండులూరి దేవి తెలిపారు. మొత్తం 168 ఎకరాలలో నారుమడులు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. వాటికి అవసరమైన 672 క్వింటాళ్ల ఎంటీయూ–1153 (చంద్ర) విత్తనాలు సిద్ధం చేశారు. 30 కిలోల బస్తా ధర రూ.1134 కాగా 80 శాతం సబ్సిడీ పోను రైతులకు రూ.227లకే విత్తనాలు ఇస్తున్నారు. ప్రస్తుతం మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి. అవసరమైన రైతులు తీసుకెళ్లాలని ఏవో దేవి కోరుతున్నారు. ఈ విత్తనం 120 రోజుల్లో కోతకు వస్తుందని ఆమె వివరించారు.

నిండా ముంచిన వర్షాలు

- తప్పని అదనపు ఖర్చులు
- గుంటూరు నుంచి నారు దిగుమతి



జగన్నాథపురం గ్రామంలో ఎర్ర కాలువ ముంపు నుంచి తేరుకోని బాడవా వరి చేలు



మారంపల్లి గ్రామంలో నాట్లు వేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: అధిక వర్షాలు రైతులను కష్టాల్లో నెట్టాయి. పోసిన నారు పాడైపోయింది. వరి నాట్లు కుళ్లిపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు తాడేపల్లిగూడెం మండలంలోని కాలువ ఆయకట్టు రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. ప్రధానంగా ఎర్ర కాలువ పరీవాహక గ్రామాలైన బంగారుగూడెం, వీరంపాలెం, పట్టింపాలెం, మాధవరం, దండగర్ర, జగన్నాథపురం, ఆరుళ్ల, మారంపల్లి, నవాబుపాలెం, నందమూరు గ్రామాల్లోని వరి నాట్లు పూర్తిగా నీట మునిగాయి. రైతులకు అపార నష్టాన్ని మిగిల్చాయి. ఎర్ర కాలువ నీరు తగ్గినా రోజుల తరబడి నాట్లు నీటిలో మునిగిపోవడంతో చాలా గ్రామాల్లో కుళ్లిపోయాయి. వరి సాగుపై మక్కువతో రైతాంగం తిరిగి నారుమడి కోసం వెతుకులాట ప్రారంభించారు. పలువురు రైతులు గుంటూరు నుంచి నారు తీసుకొచ్చి నాట్లు వేస్తున్నారు. దండగర్ర, మారంపల్లి, ఆరుళ్ల గ్రామాల్లో తిరిగి నారుమడి పోస్తున్నారు. ఇలా ఖరీఫ్ సాగు ఆదిలోనే హంస పాదు అన్న చందంగా అదనపు ఖర్చులతో సాగుతోంది.

గుంటూరు నారు తీసుకొచ్చాం



స్థానికంగా నారు లభించకపోవడంతో గుంటూరు నుంచి నలుగురైదుగురు రైతులు కలిసి రూ.18 వేలు పెట్టి నారు కొనుగోలు చేశాం. తన ఒక్కడికే 80 సెంట్లు నారుమడికి రూ.3 వేలు ఖర్చు అయింది. నాట్లు వేయడానికి మరో రూ.2 వేలు ఖర్చవుతుంది. సాగు తలకు మించిన భారంగా మారింది.

– పెనుగొండ వెంకన్న, కౌలు రైతు, మారంపల్లి

వృద్ధులకు వైద్యసేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహించే ఇంటింటికీ వైద్యసేవల కార్యక్రమంలో ఐదుగురు వృద్ధులకు వైద్య సేవలు అందించినట్టు అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.కరుణాకర్ చౌదరి తెలిపారు. నేత్ర, జనరల్ వైద్యులు హుస్సేన్ అహ్మద్, నీలు మహేంద్రలు తణుకు పట్టణం, పైడిపర్రు, కె.సావరం పరిశర గ్రామాల్లో అవసరమైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. సంఘ సభ్యులు ఎం రవి రిజనాల్డ్ ఆర్థిక సాయంతో మందులు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎండీ స్వాహాలిక, కోశాధికారి ఆర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నాదెళ్ల కృష్ణానందం తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ



వేల్పూరులో ఓ షాపు నుంచి విరాళాలు సేకరిస్తున్న నాయకులు

తణుకు టౌన్: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ ప్రాంతంలో సంభవించిన ప్రకృతి విలయ బాధితులను ఆదుకొనేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని సీపీఎం నాయకుడు బళ్ల చిన వీరభద్రరావు కోరారు. ఆదివారం తణుకు మండలం వేల్పూరు గ్రామంలో ఆయన పార్టీ కార్యకర్తలతో కలిసి షాపుల వద్ద విరాళాలు సేకరించారు. వేల్పూరు సాలిపేట నుంచి బస్టాండ్ వరకూ ఉన్న షాపుల నుంచి రూ.10,400 సేకరించినట్టు చెప్పారు. దాతలందరికీ వీరభద్రరావు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వాసా వెంకటేశ్వరరావు, తిరునాథం వెంకటేశ్వరరావు, సోరపల్లి రామకృష్ణ, విశ్వనాథం నారాయణ, అల్లం శ్యామ్, యండమూరి నాగేంద్ర, టి.సత్యనారాయణ పాల్గొన్నారు.

తణుకులో విరాళాల సేకరణ

తణుకు: కేరళ వడయార్‌లో ప్రకృతి వైపరీత్యాలు కారణంగా వరద బాధితుల సహాయార్థం సీపీఎం ఆధ్వర్యంలో తణుకులోని పలు ప్రాంతాల్లో ఆదివారం విరాళాలు సేకరించారు. రూ.3 వేలు సేకరించినట్టు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పీవీ ప్రతాప్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గారరంగారావు, రమేష్, భాస్కరరావు, అంజి, సాయిబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో..

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆంధ్ర, కేరళ వరద బాధితుల సహాయార్థం సీపీఎం కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా తాడేపల్లిగూడెం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో విరాళాల సేకరించారు. నాయకులు రామకృష్ణ, సిరపరపు రంగారావు, జవ్వాది శ్రీను, యాండ్రపు కృష్ణ, శిద్ధిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీను, వర్రి అప్పారావు, నరమాల కృష్ణ, చిట్టేటి సత్యనారాయణ, చిట్టి దుర్గాప్రసాద్, మిద్దే జాన్, యడవల్లి వెంకట దుర్గారావు, పతివాడ నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలతో జరభద్రం

- పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు
- అప్రమత్తతే ఔషదం



డ్రై డే పురస్కరించుకొని ర్యాలీ చేస్తున్న ఆరోగ్యసిబ్బంది (ఫైల్)



కొండేపాడు స్కూల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పెంటపాడు: వర్షాకాలం... ఎక్కడ చూసినా చిత్తడిగానే కనిపిస్తుంది. పైగా లోతట్టు ప్రాంతాలు, ఇటీవల భారీ వర్షాలతో పలు గ్రామాలు చిత్తడిగా మారాయి. దోమలు విజృంభిస్తున్నాయి. జ్వరాలు ప్రభలుతున్నాయి. ఖాళీ స్థలాల్లో మురుగునీరు చేరి అపరిశుభ్రత చోటు చేసుకుంటుంది. దీంతో దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతున్నాయి. పలు గ్రామాల తాగునీటి చెరువుల పర్యవేక్షణలోపం వల్ల తాగునీరు కూడా కలుషితం అవుతోంది. వాతావరణ మార్పుల కారణంగా దోమలు పెరిగి మలేరియా, టైఫాయిడ్, డెంగీ, తదితర సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. ప్రధానంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు వ్యాధుల బారిన పడుతున్నారు. అందుకే ప్రజలు పరిసరాల శుభ్రతతో పాటు, సురక్షితమైన తాగునీరు తాగడం, దోమ తెరలు వాడటం, తదితర ముందు జాగ్రత్తలు తీసుకొంటే సీజనల్ వ్యాధులు దరి చేరవని వైద్యులు సూచిస్తున్నారు.

పరిశుభ్రతే శ్రీరామరక్ష

దోమల వ్యాప్తి కారణంగా మలేరియా, బోధకాలు, డెంగీ, చికెన్‌గున్యా, తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, ఇంట్లోను నీరు నిల్వలేకుండా చూసుకోవాలని వైద్యాధికారుల సూచిస్తున్నారు. వర్షాకాల ప్రారంభ సమయంలో దోమలు గుడ్లు లార్వా దశకు చేరుకోవడం వల్ల సాధారణంగా దోమల ఉధృతి అధికంగా ఉంటుంది. నీరు నిల్వచేసిన డ్రమ్ములు, పాడైపోయిన టైర్లు, పూలకుండీలు, ఇంకుడు గుంతలు, సంపులు, పాడేసిన కొబ్బరిబొండాలు, ఫ్లవర్‌వాజ్‌లు, రుబ్బురోళ్లు, వాటర్‌ట్యాంకుల్లో దోమల లార్వా అధికంగా వ్యాప్తి చెందుతుంది. దోమలను లార్వా దశలోనే అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రధానంగా ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలని సూచిస్తోంది. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సీజన్‌లతో నిమిత్తం లేకుండా డ్రై డేపై అవగాహన కల్పిస్తున్నారు.

ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి



వర్షాకాలంలో కాచి చల్చార్చిన నీటిని తాగడం, వేడి ఆహారమే తీసుకోవడం, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, రోగ నిరోధక శక్తిని పెంచుకోవడం తదితర జాగ్రత్తలు పాటించాలి. దీంతో పాటు ప్రజలంతా ప్రతి శుక్రవారం డ్రై డే తప్పనిసరిగా పాటించాలి. సీజనల్ వ్యాధుల నివారణకు అవసరమైన మందులు పీహెచ్‌సీలో సిద్ధంగా ఉన్నాయి.

– ఎం. పూజిత, ముదునూరు ప్రాథమిక వైద్యాధికారి

ప్రమత్తమైన యంత్రాంగం

గ్రామాల్లో జ్వరాలు పెరుగుతున్న నేపథ్యంలో వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఏఎన్‌ఎంలు, కమ్యూనిటీ ఆరోగ్య అధికారులు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి జ్వర లక్షణాలు ఉన్నవారి రక్తాన్ని సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపిస్తున్నారు. ఫ్యామిలీ మెడికల్‌ప్రోగ్రాంలో భాగంగా కూడా ఇంటింటికి డాక్టర్లు రావడంతో అక్కడిక్కడే రోగులు పరీక్షలు చేయించుకొని మందులు వాడుతున్నారు. జ్వరాలు నిర్ధారణ అయిన వారికి మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకొంటున్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. పరిసరాల శుభ్రత, పారిశుద్ధ్య పనులపై పంచాయతీ, ఆరోగ్య అధికారులు సమన్వయంతో చర్యలు చేపడుతున్నారు.

శాకాహారంతో ఆరోగ్యం

అత్తిలి: మానవ శరీరం శాకాహారం భుజించడానికే నిర్మితమైందని, ప్రతి ఒక్కరూ శాకాహారాన్ని భుజించి ఆరోగ్యవంతులు కావాలని అత్తిలి పిరమిడ్ స్పిరిచ్యుటల్ సొసైటీ నిర్వాహకుడు దాసం వెంకట ప్రసాద్ సూచించారు. అత్తిలిలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం శాకాహార ర్యాలీ నిర్వహించారు. అహింసా పరమోధర్మః అన్న బుద్ధుని ప్రవచనాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ శాకాహారులుగా మారి, హింసను విడనాడాలని కోరారు. ఏఎంసీ మాజీ చైర్మన్లు దాసం బాబ్జి, పోలిశెట్టి చంటి, జనసేన మండల అధ్యక్షుడు దాసం ప్రసాద్, బోడపాటి సూర్యచంద్రరావు, కడలి మాణిక్యాలరావు, బేతు శ్రీనివాసరావు, ధ్యానులు, శాకాహార ప్రచార కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి ప్రసాదించిన బంధం స్నేహం



స్నేహితులను సత్కరిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: ప్రకృతి ప్రసాదించిన బంధం స్నేహమని తణుకు సాహితీ సామ్రాజ్యం అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు అన్నారు. ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో తణుకులోని మారుతీ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మానవ సంబంధాలన్నింటిలోనూ స్నేహ బంధమే గొప్పదని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు స్నేహితుల స్నేహం గురించి వివరించారు. వివిధరంగాలకు చెందిన కలగడ దుర్గా ప్రతాప్, మానేపల్లి సత్యనారాయణ, కడించర్ల రామారావు, కలే లక్ష్మణ్, మంగారావు, రాజా శివ తదితరులను సత్కరించారు. టి.నరసింహారావు, బీవీవీ సత్యనారాయణ, ఎంమోహన్‌రావు, ఆలంగీర్ బాషా, కేవీఎస్‌డీ ప్రసాద్, వెంకట కృష్ణ పాల్గొన్నారు.